TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్
# ADAAB CYBERABAD

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

ఎడిటర్ : బిఎస్ శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 84 | గురువారం, అక్టోబర్ 08, 2026, | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 84 | 08-10-2026 (THURSDAY) | PAGES: 4 | RS : 5/-

**విలేకరులు కావలెను**

అనుభవజ్ఞులైన జర్నలిస్టుల సారథ్యంలో
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రెండు తెలుగు రాష్ట్రాలలో
అతితక్కువ సమయంలో గుర్తింపు.
ప్రజాధరణ పొందిన ప్రింట్ - డిజిటల్ పత్రిక
రంగంలో ముందుకు దూసుకువెళుతూ..
అందరినీ ఆకట్టుకున్న
'ఆదాబ్ సైబరాబాద్'
దిన పత్రిక.

1. జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్
2. జిల్లా ఫోటో గ్రాఫర్స్
3. ఆర్. సీ ఇన్చార్జులు
4. మండల రిపోర్టర్స్
5. క్రైమ్ రిపోర్టర్స్

అనుభవజ్ఞులకు ప్రాధాన్యం అలాగే నూతన అభ్యర్థులకు అవకాశం కల్పించబడును.

సంప్రదించాల్సిన నెంబర్
8686861338

## మూసీ రివర్‌ఫ్రంట్‌లో భారీ
# అభివృద్ధి పనులు

### రూ.1,108 కోట్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్




**హైదరాబాద్, అక్టోబర్ 7:** మూసీ రివర్‌ఫ్రంట్‌లో భారీ అభివృద్ధి పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంచిరేవుల ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయ అభివృద్ధితో పాటు ఆరు లేన్ల రహదారి నిర్మాణానికి కలిపి రూ. 1,108.27 కోట్లకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులను జారీ చేసింది. ఈ మేరకు ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంచిరేవులలో ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయ అభివృద్ధి పనులకు రూ. 948.65 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఆలయ సముదాయంలో రాజగోపురాలు, యాగశాల, పుష్కరిణి తదితర నిర్మాణాలు చేపట్టనున్నారు. అలాగే ఆరు లేన్ల రహదారి నిర్మాణానికి మరో రూ. 159.62 కోట్లు కేటాయించింది. 30 మీటర్లు.. 100 అడుగుల వెడల్పుతో ఆరు లేన్ల రోడ్డును నిర్మించనున్నారు. ఇస్తానా విల్లాస్ నుంచి కీర్తి వెస్ట్‌విండ్ విల్లాస్ వరకు సుమారు 2.50 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించనున్నారు. ఈ ఆరు లేన్ల రహదారి గ్రేహౌండ్స్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రాంతాలకు అనుసంధానం కానుంది. అలాగే మూసీ రివర్‌ఫ్రంట్ రోడ్ నెట్‌వర్క్‌తో ఓంకారేశ్వర ఆలయ సముదాయానికి మెరుగైన కనెక్టివిటీ కల్పించనున్నారు. మరో కీలక నిర్ణయం మూసీ ప్రాజెక్ట్‌లో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మంచిరేవుల కమిటీని ఏర్పాటు చేసింది. రూ. 700 కోట్ల ఆలయ ప్రాజెక్ట్‌కు టెక్నికల్ కమిటీ సాంకేతిక మార్గదర్శకత్వం అందించనుంది. డిజైన్లు, డీపీఆర్‌లు, రేట్లు, టెండర్లపై కమిటీకి కీలక బాధ్యతలు అప్పగించారు

## సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో మోదీ
# రాజీనామా చేయించాలి

- **రాహుల్ గాంధీ ఢిల్లీలో ప్రజాస్వామ్యయుతంగా చేపట్టిన ఆందోళనను అడ్డుకోవడం మోదీ, అమిత్ షా నిరంకుశత్వానికి నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.**




**న్యూ ఢిల్లీ :** ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ రాహుల్‌గాంధీ ప్రజాస్వామ్యయుతంగా చేపట్టిన ఆందోళనలను అడ్డుకోవడం మోదీ, అమిత్ షా నిరంకుశత్వానికి నిదర్శమని మండిపడ్డారు. పోలీసులు అరెస్టు చేసిన రాహుల్, ప్రియాంకలను కలిసేందుకు యత్నించిన రేవంత్‌రెడ్డి, కేరళం సీఎం సతీశన్‌లను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల చర్యను రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో తప్పుపట్టారు."ఇది కాంగ్రెస్ సమస్య కాదు, ఈ దేశ ప్రజల సమస్య అందుకే ప్రధాని మోదీ మీరు భావోద్వేగానికి గురికాకండి. జ్ఞానేశ్‌కుమార్‌తో రాజీనామా చేయించండి. రాజ్యాంగాన్ని కాపాడేందుకు, పేద ప్రజలు ఓటు వేసేందుకు ఈ ఎన్నికల సంఘాన్ని ఉపయోగించండి. లేకపోతే ఈ ఉద్యమం ఆపేది లేదు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో రోడ్డు నుంచి పార్లమెంట్ దాకా, ఏం జరిగినా సరే, మేము నిశ్శబ్దంగా కూర్చోం. కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు ఇండియా కూటమి నేతలంతా రోడ్ల మీదకు వస్తారు. అందుకే మేం డిమాండ్ చేస్తున్నాం, జ్ఞానేశ్‌కుమార్‌తో నరేంద్ర మోదీ రాజీనామా చేయించాలి" - రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎంసర్?ను తక్షణమే నిలిపివేయాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల ఓటు హక్కును ఈసీ హరిస్తోందని, ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ ఓట్ల టార్గెట్‌గా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలవడానికి ఈడీ, సీబీఐని వాడేవారని, ఇప్పుడు ఈసీని ప్రయోగిస్తున్నారని సీఎం విమర్శించారు. రాహుల్‌గాంధీ కి మద్దతుగా జగ్గారెడ్డి దీక్షరాహుల్‌గాంధీకి మద్దతుగా దీక్ష చేపడతానన్న కాంగ్రెస్ పార్టీ నేత జగ్గారెడ్డి తెలిపారు. బీజేపీ, ఈసీకి వ్యతిరేకంగా రాహుల్ పోరాటం చేస్తున్నారన్న జగ్గారెడ్డి రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ ఎన్ని రోజులు పోరాటం చేస్తే అన్ని రోజులు దీక్ష చేపడతాని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

### త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం బండి సంజయ్ నోట
# ఆసక్తికర మాటలు!



**హైదరాబాద్:** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు త్వరలో తెలంగాణ బీజేపీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని, కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించా రు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం అంతా డ్రామానేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో కాంగ్రెస్ పీసీసీలన్నీ సర్దార్ పటేల్ ప్రధాని కావాలని ప్రతిపాదించినా.. నెహ్రూను ప్రధాని చేశారని విమర్శించారు. దేశంలో బోగస్ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్సే చెప్పిందని, వాటిని తొలగిస్తుంటే ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు ఆయనకు అవసరం లేదని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో అక్రమ చొరబాటుదారుల ఓట్లపై కూడా బండి సంజయ్ ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే 30 వేలకు పైగా రోహింగ్యాల ఓట్లు ఉన్నాయని అన్నారు.

## దిల్లీలో మరోసారి
# ఉద్రిక్త వాతావరణం




**న్యూ ఢిల్లీ :**
ఢిల్లీలో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్ష ఇండీ కూటమి ఎంపీలు మరోసారి ఆందోళన చేపట్టారు. మొదట ఓ హోటల్‌లో సమావేశమైన నేతలు, తర్వాత బస్సుల్లో ఎన్నికల సంఘం కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మోదీ సర్కార్ రాజ్యాంగాన్ని అవమానిస్తోందని ఆరోపించారు. ఈసీ అరాచకాలను దేశం మట్నత్తం ప్రచారం చేస్తామన్న ఆయన, కేంద్ర ప్రభుత్వ బెదిరింపులకు తలొగ్గేది లేదని తెలిపారు. జజుజ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. మంగళవారం ఈసీని కలుద్దామని 300 మంది ఎంపీలం వెళ్లామన్న రాహుల్‌గాంధీ, తమను పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదన్న రాహుల్, ఆయన రాజీనామా చేసేవరకూ పోరాటం కొనసాగిస్తాన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తనపై పెట్టే కేసులను పతకాలుగా భావిస్తానని తెలిపారు. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈసీని కలవాలనుకున్నాం. కానీ వారు మమ్మల్ని కలవడానికి నిరాకరించారు. ఢిల్లీ పోలీసులు మమ్మల్ని అడ్డుకుని అక్కడ నిరసన తెలపడానికి వీల్లేదని చెప్పారు. అయితే, ఈ రోజు మేము నిర్ణీత నిరసన స్థలమైన 'జంతర్ మంతర్'కు వెళ్లి ఆందోళనకు దిగుతాం. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదు. జంతర్‌మంతర్ వద్ద కూర్చుని దేశానికి ఒక విషయాన్ని స్పష్టం చేయాలనని అనుకుంటున్నాం.

## ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రస్థానంపై
# ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం



**అమరావతి, అక్టోబరు 7 :**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం (బుధవారం) సచివాలయంలో జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలను ఆమోదించారు. 12 అజెండా అంశాలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కేబినెట్ అజెండా పూర్తి అయినా వెంటనే ఇతర అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందనలు తెలుపుతూ ఏపీ మంత్రి మండలి తీర్మానం ప్రవేశపెట్టింది. మోదీ పరిపాలనను ప్రశంసిస్తూ సీఎం, మంత్రులు మాట్లాడారు. మోదీ పరిపాలనను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు ప్రశంసించారు. ఆయనను అభినందిస్తూ చేసిన రెండు పేజీల తీర్మానాన్ని చదివి మంత్రి నారా లోకేశ్ వినిపించారు. సీఎంగా, ప్రధానిగా 25 ఏళ్లు పనిచేసి ప్రజలను మెప్పించడం సామాన్యమైన విషయం కాదని సీఎం చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. మనం కూడా 25 ఏళ్లు వరుసగా పాలనలో ఉండలేకపోయామని ప్రస్తావించారు. కొంతమంది సీఎంగా 25 ఏళు తీసుకురాలేకపోయారని చెప్పుకొచ్చారు. కానీ జనాన్ని మెప్పించి పరిపాలన చేయడమే గాకుండా సంస్కరణలు కూడా చేసి జనాన్ని మోదీ ఒప్పించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వాధిపతిగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీకి అభినందనలు తెలుపుతూ ఏపీ కేబినెట్ ప్రత్యేక తీర్మానం ఆమోదించిందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రధాని మోదీ పాలనా సంస్కరణలు, కట్టుబాట్లను స్ఫూర్తిగా తీసుకుని ఆయా జిల్లాల అభివృద్ధికి కృషి చేయాలని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారని అన్నారు.

# యాదాద్రి పవర్ ప్లాంట్ పాపం ఎవరిది..

### రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!

**హైదరాబాద్, అక్టోబర్ 7:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరిగిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పీక్ డిమాండ్ 19, 892 మెగావాట్స్‌కు పెరిగిందని.. అయినా కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. అభినందించాల్సింది పోయి కొందరు అదే పనిగా విమర్శిస్తున్నారని.. అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్రతిష్ఠ పాలు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పదేళ్లు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ఇలా మాట్లాడటం సరికాదని విమర్శించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోను ప్రైవేటుపరం చేస్తారని కొందరు రాస్తున్నారని.. దాన్ని మరికొందరు ప్రచారం చేస్తున్నారన్నారు. తెలంగాణ మీద ప్రేమ ఉంటే నష్టం చేసే ప్రచారం మానాలని హితవుపలికారు. విద్యుత్ సరఫరాపై ప్రతిపక్షాలు బురదజల్లి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారని విమర్శించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. తమకు రాజకీయాల లబ్ధి కంటే రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు ముఖ్యమని స్పష్టం చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ భారం పాపం ఎవరిదని భట్టి ప్రశ్నించారు. ఎక్కడైనా కోల్ లింకేజి చేసుకుని థర్మల్ పవర్ ప్లాంట్ పెడతారని.. సింగరేణి నుంచి కోల్ సరఫరా చేయిస్తామని చెప్పి యాదాద్రి ప్లాంట్ మొదలు పెట్టారని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కానీ దానికి కావాల్సిన +9 కోల్ సింగరేణి వద్ద లేదని అన్నారు. అయినా తప్పుడు సమాచారం ఇచ్చి ప్రాజెక్ట్ మొదలు పెట్టారని ఆరోపించారు. యాదాద్రికి ప్రతి ఏటా 14 మిలియన్ టన్నుల కోల్ అవసరమని.. 7 మిలియన్ టన్నుల కోల్ సింగరేణి నుంచి సరఫరా చేస్తామని ఎంఓయూ చేశారని గుర్తుచేశారు. మరో 50శాతం కోల్ ఇంపోర్ట్ చేసుకుంటామని అన్నారని తెలిపారు.



### తెలంగాణను అత్యుత్తమ పెట్టుబడి
## గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి



**హైదరాబాద్, అక్టోబరు 7 :**
పెట్టుబడులను ఆకర్షించేందుకు సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని సీఎస్ సంజయ్ జాజు అధ్యక్షతన సచివాలయంలో (బుధవారం) నిర్వహించారు. తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని సీఎస్ ఆదేశించారు.

## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
# రెండు డీఏలు మంజూరు




**హైదరాబాద్, అక్టోబర్ 7:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ శుభవార్త చెప్పింది ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు మంజూరు చేస్తూ రాష్ట్ర సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 2024 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి పెంచింది. అలాగే జూలై 2024 నుంచి డీఏ 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా 2015 పే స్కేల్ ఉద్యోగులకు కూడా డీఏ 73.344 శాతం నుంచి 78.06 శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జూలై 2024 నుంచి 78.06 శాతం నుంచి 81.728 శాతానికి, 2020 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచింది. యూజీసీ, ఏఐసీటీఈ పే స్కేళ్ల ఉద్యోగులకు కూడా డీఏ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2016 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 46 శాతం నుంచి 50 శాతానికి, జూలై 2024 నుంచి డీఏ 50 శాతం నుంచి 53 శాతానికి పెంచింది. అలాగే 2006 పే స్కేల్ ఉద్యోగుల కు డీఏ 230 శాతం నుంచి 239 శాతానికి, జూలై 2024 నుంచి 239 శాతం నుంచి 246 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన డీఏ అక్టోబర్ 2026 జీతంతో కలిపి నవంబర్ 1న చెల్లించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. జనవరి 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఉన్న డీఏ బకా యిలను 33 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిం చనుంది. అదే విధంగా జూలై 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఉన్న డీఏ బకాయి లను 27 వాయిదాల్లో చెల్లింపులు జరుపనుంది. డీఏ జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

గురువారం,
అక్టోబర్ 08, 2026
TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



# సేవే లక్ష్యంగా.. కుల్కచర్లలో డాక్టర్ టి.రితిక్‌రెడ్డి జన్మదిన వేడుకలు.

**టి ఆర్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రితిక్ రెడ్డి.**



ఆదాబ్ సైబరాబాద్. పరిగి.యువ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు, టీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ టి.రితిక్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో టీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం, ఉచిత మందుల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ టి.రితిక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేవా కార్యక్రమాలకు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. సమాజ సేవే లక్ష్యంగా నిర్వహించిన కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. రక్తదానం చేసిన వారిని డాక్టర్ రితిక్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి, ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. సమాజ సేవలో భాగస్వాములు కావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

# చెత్తకుప్పలతో మారుతి నగర్ వాసుల అవస్థలు

**దుర్వాసనతో అనారోగ్య సమస్యలు.. వీధికుక్కల బెడదతో భయాందోళన**



అదాబ్ సైబరాబాద్, జవహర్‌నగర్: చంద్రపురి కాలనీ--2 పరిధిలోని మారుతి నగర్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పక్కనే చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చెత్తకుప్పల కారణంగా వీధికుక్కల బెడద పెరిగిందని, చిన్నారులను బయటకు పంపేందుకు భయపడుతున్నామని తెలిపారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. తక్షణమే చెత్తను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని బూడిద వెంకటేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీవిద్య, మంజుల, హేమవతి, చంద్రకళ, మీనాక్షి, సరస్వతి, శంకరమ్మ, సురేష్, రామచందర్ తదితరులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# మల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ అందజేత.

**కె ఎస్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా.**



ఆదాబ్ సైబరాబాద్. పరిగి.దోమ మండలంలోని మల్లేపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కెఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు శ్రీ శరత్‌కుమార్ రెడ్డి రూ.30 వేల విలువైన వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు వాటర్ ప్యూరిఫైయర్‌ను అందించినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని శరత్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.కార్యక్రమంలో దోమ మండల ఎంఈఓ వెంకట్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, అమర్‌నాథ్, పీఆర్పీయూ దోమ మండల అధ్యక్షుడు కేశవులు, బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశం, మల్లప్ప, మల్లయ్య, మొగులయ్యగౌడ్, చెన్నకిష్టయ్య, అంజిలయ్య, తిరుమలేశ్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు చేయూత.. గంజిపల్లి తాండలో సైకిళ్ల పంపిణీ.

**టి ఆర్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రితిక్ రెడ్డి.**



ఆదాబ్ సైబరాబాద్. పరిగి. విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూత అందించాలనే ఉద్దేశంతో యువ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు, టీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ టి. రితిక్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో దోమ మండలం గంజిపల్లి తాండలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ టి. రితిక్ రెడ్డి విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు.అనంతరం విద్యార్థులతో కలిసి రితిక్ రెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి చదువులు, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులపై ఎస్పీ స్నేహ మెహ్రా సమీక్ష

**కేసుల దర్యాప్తు, న్యాయస్థాన ప్రక్రియల్లో జాప్యం ఉండకూడదు**
**నిర్దేశిత గడువులోగా కేసుల పరిష్కారం, అభియోగపత్రాల దాఖలుపై ప్రత్యేక దృష్టి**





ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా : పోలీసు శాఖ పరిధిలో కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్‌లో ఉన్న కేసులు, న్యాయస్థానాలకు సంబంధించిన ప్రక్రియలు, సమగ్ర నేర న్యాయ వ్యవస్థ, నేరం మరియు నేరస్థుల గుర్తింపు నమోదు వ్యవస్థ తదితర అంశాలపై వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా దృశ్య శ్రవణ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని సంబంధిత డీఎస్పీలు, సీఐలు, పోలీసు స్టేషన్ అధికారులతో కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ నివేదికలు, న్యాయస్థాన ప్రక్రియలు, నేర కేసుల వివరాల నమోదు తదితర అంశాలపై ఎస్పీ సమీక్షించారు. ప్రధానంగా న్యాయస్థానాల నుంచి వచ్చే సమన్లను స్వీకరించడం, కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించడం, భారతీయ న్యాయ సంహితకు సంబంధించిన కేసులను నిర్దేశిత 60, 90 రోజుల గడువులోగా పరిష్కరించడం, దర్యాప్తు పూర్తయిన కేసుల్లో 60 రోజుల్లోగా అభియోగపత్రాలు దాఖలు చేయడం వంటి అంశాలను ఎస్పీ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, నివేదికలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, దర్యాప్తులో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. కేసులకు సంబంధించిన వివరాలను సంబంధిత నమోదు వ్యవస్థల్లో ఖచ్చితంగా నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతను పెంచడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. న్యాయస్థానాలకు సంబంధించిన ప్రక్రియలను సకాలంలో పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ దృశ్య శ్రవణ సమావేశంలో డీసీఆర్బీ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేశం, సమాచార సాంకేతిక విభాగం ఎస్ఐ శంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**అనుమానాస్పద లింక్‌లను తెరవొద్దు..**
**గోప్య సమాచారాన్ని ఎవ్వరికీ వెల్లడించొద్దు**
**మోసానికి గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలి**
**వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా కీలక సూచనలు**




ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసోత్సవంలో భాగంగా బుధవారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ అవగాహన పోస్టర్లను ఎస్పీ విడుదల చేశారు. ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగ్రూక్తా దివస్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, సందేశాలు, సామాజిక మాధ్యమాలు, నకిలీ ఆఫర్లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, రుణ యాప్‌లు తదితర మార్గాల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు 'ఆగండి.. ఆలోచించండి.. నిర్ధారించుకోండి' అనే విధానాన్ని పాటించాలని సూచించారు. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఆకర్షణీయమైన ఆఫర్లను నమ్మి ముందస్తుగా డబ్బులు చెల్లించవద్దని సూచించారు. అనధికారిక రుణ యాప్‌లను వినియోగించకూడదని, ఓటీపీ, యూపీఐ పిన్, ఏటీఎం పిన్, సీవీవీ, పాస్‌వర్డ్‌ల వంటి గోప్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సైబర్ క్రైమ్ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. ప్రజల్లో సైబర్ నేరాలపై నిరంతరం అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ కాజోల్ జైస్వాల్, డీసీఆర్బీ డీఎస్పీ జనయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల పోరాటం మరువలేనిది

**తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర కీలకమన్న ఎమ్మెల్యే బాలు నాయక్**
**యూనియన్లకు మళ్లీ ప్రాధాన్యం కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం**
**బాణం, నక్షత్రం గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని సూచన**





ఆదాబ్ సైబరాబాద్, దేవరకొండ: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.
ఈ నెల 9న జరగనున్న ఆర్టీసీ యూనియన్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం దేవరకొండ ఆర్టీసీ డిపోలో ఎమ్మెల్యే బాలు నాయక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి బుధవారంతో గడువు ముగియనున్న నేపథ్యంలో డిపో పరిధిలోని కార్మికులను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యోగులు చేపట్టిన ఉద్యమాల్లో ఆర్టీసీ కార్మికుల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు చేసిన పోరాటాన్ని ఎప్పటికీ మరువలేమని తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు యూనియన్లు బలమైన వేదికగా పనిచేయాలని సూచించారు.

**యూనియన్లకు మళ్లీ ప్రాధాన్యం**

గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మిక సంఘాలకు తగిన ప్రాధాన్యం లేకుండా పోయిందని బాలు నాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల సమస్యలు, హక్కులపై చర్చించేందుకు యూనియన్లకు మళ్లీ ప్రాధాన్యం లభించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

**ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తాం**

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. దేవరకొండ డిపో పరిధిలో మొత్తం 365 ఓట్లు ఉన్నాయని, ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

**కూటమి అభ్యర్థులను గెలిపించాలి**

కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న కార్మిక సంఘాల కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని బాలు నాయక్ కార్మికులను కోరారు. బాణం గుర్తుపై, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.
ఎమ్మెల్యే సమక్షంలో వివిధ సంఘాలకు చెందిన పలువురు ఆర్టీసీ ఉద్యోగులు కూటమిలో చేరారు. వారికి యూనియన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆర్టీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బాలు నాయక్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పున్న వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నర్సింహా, హనుమంతు వెంకటేష్ గౌడ్, మహ్మద్ రయీస్, దూదిపాల వేణుధర్ రెడ్డి, మారుపాకుల సురేష్ గౌడ్, కొర్ర రాంసింగ్ నాయక్, కిన్నెర హరికృష్ణ, హనుమంతు సాయిచంద్ర, మహమ్మద్ ఇలియాస్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# కొత్త నేర చట్టాలపై పోలీసులకు పూర్తి అవగాహన ఉండాలి

**చట్టాలను కచ్చితంగా అమలు చేస్తూ ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలి**
**వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశం**





ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా : కొత్త నేర చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన పోలీసింగ్ సేవలు అందించాలని ఆదేశించారు. కొత్త నేర చట్టాలు--2023 అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు, సిబ్బందికి చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు డీటీసీలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ స్నేహ మెహ్రా హాజరై పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా భారతీయ న్యాయ సంహిత--2023, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత--2023, భారతీయ సాక్ష్య అధినియం--2023లోని కీలక నిబంధనలపై ప్రతి ఒక్కరూ స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ సూచించారు. కేసుల నమోదు, దర్యాప్తు విధానాలు, సాక్ష్యాల సేకరణ, డిజిటల్ మరియు ఎలక్ట్రానిక్ సాక్ష్యాల ప్రాధాన్యత, బాధితుల హక్కులు, అరెస్ట్, రిమాండ్ విధానాలు, కోర్టు విచారణ తదితర అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించారు. కొత్త చట్టాల అమలులో పోలీసులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయడం, దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచడం, ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించడం శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. శిక్షణలో పాల్గొంటున్న పోలీస్ అధికారులు, సిబ్బందితో ఎస్పీ మాట్లాడి కొత్త నేర చట్టాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. విధుల నిర్వహణలో చట్టపరమైన పరిజ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకోవడంతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే పరిగి మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



ఆదాబ్ సైబరాబాద్. పరిగి. వికారాబాద్ జిల్లా పరిగి మండల టీయూడబ్ల్యూజే హెచ్-143 నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పి. సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఖైసర్, రాఘవేందర్, ప్రధాన కార్యదర్శిగా నర్సింలు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా శ్రీశైలం, ఇస్మాయిల్, కార్యదర్శులుగా ప్రఫుల్‌కుమార్, మోహన్‌చారి, చి. ఆంజనేయులు, కోశాధికారిగా జ్యోతిర్లింగం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వేమన, కృష్ణ, మజీద్ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పి. సతీష్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో పరిగి డివిజన్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బాబయ్య, రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాము, ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేష్, కార్యదర్శులు ముక్తార్, మీర్ యూసుఫ్ అలీతో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారంలో ఏజెన్సీ కోర్టు ఏర్పాటు చేయాలి

**ములుగు జిల్లా కేంద్రమైన ఏటూరునాగారంలో వెంటనే ఏజెన్సీ కోర్టును ఏర్పాటు చేయాలని ఆదివాసీ ప్రజలు, సంఘాలు కోరుతున్నారు**



ఆదాబ్ సైబరాబాద్,ములుగు,డిమాండ్ లోని ముఖ్య అంశాలు

1. ములుగు జిల్లా షెడ్యూల్డ్ ఏరియా పరిధిలోకి వస్తుంది. జిల్లా జనాభాలో 70% పైగా గిరిజనులు ఉన్నారు.
2. గిరిజనుల భూ వివాదాలు, 1/70 చట్టం కేసులు, అప్పుల కేసుల కోసం ప్రస్తుతం భద్రాచలం ఏజెన్సీ కోర్టుకు 120 కి.మీ దూరం వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల నిరుపేద గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.
3. జిల్లాలో 5 వేలకు పైగా భూవివాద కేసులు పెండింగ్ లో ఉన్నాయి.
4. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్, PESA చట్టం 1996 ప్రకారం ప్రతి ఏజెన్సీ డివిజన్ కేంద్రంలో ఏజెన్సీ కోర్టు ఉండాలి.కావున, గిరిజన రైతులకు న్యాయం జరిగే విధంగా, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ హైకోర్టు చొరవ తీసుకొని ఏటూరునాగారంలో ఏజెన్సీ కోర్టును ఏర్పాటు చేయాలని మేము కోరుతున్నాము. డా సంతోష్ కుమార్ మైపతి వనవాసి కళ్యాణ పరిషత్ ములుగు జిల్లా సెల్: 8639276221

# ములుగు జిల్లాలో సైబర్ నేరాలపై అవగాహనకు ప్రత్యేక ప్రచారం

**నకిలీ లోన్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి**
**పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్ పి కేకాన్ సుధీర్ రామనాథ్ ఐ పి ఎస్**



ఆదాబ్ సైబరాబాద్,ములుగు,ములుగు జిల్లాలోని పలు ప్రాంతాల్లో సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన "Fraud Ka Full Stop"( ఫ్రాడ్ గా ఫుల్ స్టాప్ ) కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సైబర్ మోసాల నివారణపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఎస్పీ మాట్లాడుతూ, తక్షణ రుణాలు, తక్కువ వడ్డీ రుణాలు, నిమిషాల్లో లోన్ మంజూరు అంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలను ఆకర్షించి, లోన్ ప్రాసెసింగ్ ఫీజు, అడ్వాన్స్ ఫీజు, జీఎస్టీ తదితర పేర్లతో ముందుగా డబ్బులు చెల్లించాలని కోరుతున్నారని తెలిపారు. ఇలాంటి నకిలీ లోన్ ఆఫర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
అత్యవసర పరిస్థితుల్లోనూ తొందరపడి ముందస్తు చెల్లింపులు చేయవద్దు. ముందుగా ఆఫర్‌ను పరిశీలించాలి, రుణదాత వివరాలను ధృవీకరించాలి, అధికారిక సంస్థల ద్వారా మాత్రమే రుణ సేవలను పొందాలి" అని ఎస్ పి సూచించారు.ప్రజలు అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు లేదా లోన్ యాప్‌లకు తమ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని తెలిపారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, అలాగే www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా డబ్బును నిలిపివేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ డీసీఆర్‌బీ కిషోర్ కుమార్, ములుగు సీఐ దారం సురేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, వెంకటాపూర్ ఎస్ఐ చల్లా రాజు, డీసీఆర్‌బీ ఎస్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# హరిజన బస్తీపై ఎందుకీ నిర్లక్ష్యం..?

**కొత్త బస్తీలకు పోటాపోటీగా సీసీ రోడ్లు.. తాతల కాలం నుంచి ఉన్న బస్తీకి మాత్రం ఎదురుచూపులే!**


డా॥ బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘము

ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : నాయకులు, అధికారులకు కనిపించని గాజులరామారం హరిజన బస్తీ ప్రజల ఇబ్బందులు ఒకవైపు కొత్తగా ఏర్పడుతున్న బస్తీలు, కాలనీల్లో రోడ్ల నిర్మాణాలకు నాయకులు, అధికారులు పోటాపోటీగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తుంటే.. మరోవైపు దశాబ్దాలుగా నివసిస్తున్న గాజులరామారం హరిజన బస్తీ మాత్రం కనీస సీసీ రోడ్డుకు నోచుకోకపోవడం స్థానికులను ఆవేదనకు గురిచేస్తోంది.
తాతల కాలం నుంచి ఈ ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలు నేటికీ సరైన రహదారి సౌకర్యం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం పడితే రహదారులు బురదమయంగా మారడం, నిత్య రాకపోకలకు ఇబ్బందులు ఎదురుకావడం, వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్ర అవస్థలు పడటం సాధారణంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.
కొత్తగా ఏర్పడిన బస్తీల్లో రోడ్లు వేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు వస్తుండగా.. ఇక్కడి ప్రజల సమస్య మాత్రం ఎందుకు పరిష్కారం కావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు కులం, వర్గం, ప్రాంతం అనే తేడా లేకుండా ప్రతి పేదవాడికి చేరాలని వారు కోరుతున్నారు.

**ఏళ్లుగా వినతులు.. అయినా పరిష్కారం ఎక్కడ?**

తమ బస్తీకి సీసీ రోడ్డు మంజూరు చేయాలని స్థానికులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వారు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో హామీలు వినిపించినా.. ఎన్నికలు ముగిసిన తర్వాత తమ బస్తీ సమస్య మళ్లీ పక్కకు వెళ్లిపోతోందని స్థానికుల ఆవేదన.
"మా బస్తీ కూడా ఇదే నగరంలో ఉంది.. మాకు కనీస అవసరాలైన రోడు మా హక్కు... మాకు కూడా రోడ్డు అవసరమే" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ఇది రోడ్డు సమస్య మాత్రమే కాదు.. సమాన అభివృద్ధికి పరీక్ష**

ఒక ప్రాంతంలో కొత్త రోడ్లు వేయడం అభివృద్ధికి సూచిక అయితే, దశాబ్దాలుగా వెనుకబడిన ప్రాంతానికి మౌలిక సదుపాయాలు కల్పించడం మరింత ముఖ్యమైన బాధ్యత. గాజులరామారం హరిజన బస్తీ విషయంలోనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులను గుర్తించి సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
"నాయకులారా.. అధికారులారా.. మా బస్తీ వైపు కూడా ఒక్కసారి చూడండి. ప్రారంభోత్సవాల కోసం కాదు.. మా సమస్య పరిష్కారం కోసం రండి" అంటూ స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.
ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గాజులరామారం హరిజన బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటారా? లేక ఈ బస్తీ ప్రజల ఎదురుచూపులు ఇలాగే కొనసాగుతాయా? అనేది వేచి చూడాలి.

# నకిలీ బంగారం చూపించి రూ.3 లక్షల మోసం

**ముందుగా అసలైన బంగారం చూపించి నమ్మించారు..**
**నగదు తీసుకుని నకిలీ బంగారం అప్పగించారు**






ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా : తక్కువ ధరకు బంగారం ఇస్తామని చెప్పి అపరిచితులు చేసే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల వెలుగులోకి వచ్చిన నకిలీ బంగారం మోసం కేసు ప్రజలకు హెచ్చరికగా నిలుస్తోందని ఆమె బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని తొండపల్లి గ్రామానికి చెందిన కంద్యానం రామస్వామి 'శ్రీ మాత టైలరింగ్ అండ్ లేడీస్ కార్నర్' పేరుతో దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తరచూ దుకాణానికి వచ్చే ఓ మహిళతో ఆయనకు పరిచయం ఏర్పడింది. అనంతరం ఆమెతో పాటు మరికొందరు రామస్వామికి పరిచయమై, తమ వద్ద పెద్ద మొత్తంలో బంగారం ఉందని, అత్యవసరంగా డబ్బు అవసరం ఉండటంతో మార్కెట్ ధర కంటే చాలా తక్కువకే బంగారం ఇస్తామని నమ్మించారు. బాధితుడికి నమ్మకం కలిగించేందుకు తొలుత చిన్న పరిమాణంలో అసలైన బంగారం ముక్కను చూపించారు. దానిని పరీక్షించుకోవచ్చని చెప్పడంతో రామస్వామి షాబాద్, లాలాపేట ప్రాంతాల్లోని బంగారు దుకాణాలకు తీసుకెళ్లి పరీక్షించగా అది అసలైన బంగారమేనని తేలింది. దీంతో నిందితులపై ఆయనకు మరింత నమ్మకం ఏర్పడింది. ఈ నమ్మకాన్ని ఆసరాగా చేసుకున్న నిందితులు తమ వద్ద ఇంకా పెద్ద మొత్తంలో బంగారం ఉందని, తక్కువ ధరకే ఇస్తామని చెప్పి రామస్వామిని నమ్మించారు. ఈ నెల 7న తొండపల్లి గ్రామానికి వచ్చిన నిందితులు బంగారం ఇస్తామని చెప్పి ఆయన నుంచి రూ.3 లక్షల నగదు తీసుకున్నారు. అనంతరం బంగారంతో కూడిన వస్తువును అప్పగించారు. అయితే దానిని బంగారు దుకాణంలో పరీక్షించగా నకిలీ బంగారం అని తేలడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. రామస్వామి ఫిర్యాదుతో పరిగి పోలీసులు క్రైమ్ నంబర్ 334/2026 నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ స్నేహ మెహ్రా నిందితులను గుర్తించి అరెస్ట్ చేయాలని అధికారులను ఆదేశించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ ఆధ్వర్యంలో సీసీఎస్ సిబ్బంది, పరిగి పోలీసులు సమన్వయంతో సాంకేతిక ఆధారాలు, ఫోన్ సమాచారం, నిందితుల కదలికలను విశ్లేషించారు. దర్యాప్తులో నిందితులు ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా ముప్పాళ్ల పోలీస్ స్టేషన్ పరిధి మాడాల గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. ఈ కేసులో బండారు నాగభూషణం (40), తమ్మిశెట్టి నాగరాజు (45), దేవళ్ల శివమ్మ (50), బండారు నాగలక్ష్మి (30) లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షల నగదు, నకిలీ బంగారం బిస్కెట్లు, నేరానికి ఉపయోగించిన సుత్తె, శణాలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

**ఆశ కంటే ముందు జాగ్రత్త ఉండాలి**

ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. మార్కెట్ ధర కంటే చాలా తక్కువకు బంగారం ఇస్తామని ఎవరైనా అపరిచితులు చెబితే వెంటనే నమ్మవద్దని సూచించారు. బంగారం కొనుగోలు చేసే ముందు గుర్తింపు పొందిన బంగారు వ్యాపారి లేదా నిపుణుడి వద్ద నాణ్యతతో పాటు తాము కొనుగోలు చేస్తున్న వస్తువు నిజమైన బంగారమేనా అనే విషయాన్ని పూర్తిగా నిర్ధారించుకోవాలని తెలిపారు. సరైన ధృవీకరణ లేకుండా పెద్ద మొత్తంలో నగదు చెల్లించవద్దని, అనుమానాస్పద లావాదేవీలు లేదా మోసం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. "తక్కువ ధరకు బంగారం వస్తుందనే ఆశ కంటే.. మన డబ్బు భద్రత ముఖ్యం. నమ్మకం కంటే ముందు ధృవీకరణ ఉండాలి. ఆశ కంటే ముందు జాగ్రత్త ఉండాలి." అని పేర్కొన్నారు.

# ఖమ్మం జిల్లా లో అర్హులందరికీ ఆసరా పింఛన్లు మంజూరు చేయాలి

**జిల్లా కలెక్టర్‌కు ఖమ్మం జిల్లా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వినతి.**
**అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ కాసోజు, కరుణాకర్ సుధగాని.**


జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ కాసోజు సెల్ నెంబర్: 9652398781
ప్రధాన కార్యదర్శి కరుణాకర్ సుధగాని సెల్ నెంబర్: 9885164088
సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఖమ్మం జిల్లా
ఫిర్యాదు / వినతిపత్రం
RECEIVED INWARD SECTION COLLECTOR'S OFFICE KHAMMAM.



ఆదాబ్ సైబరాబాద్,ఖమ్మం :ఖమ్మం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఖమ్మం జిల్లా శాఖ డిమాండ్ చేసింది.
ఈ మేరకు బుధవారం ఖమ్మం జిల్లా ఇన్వార్డ్ సెక్షన్ కలెక్టరేట్ ఆఫీస్ లో కమిటీ ప్రతినిధులు వినతిపత్రాన్ని సమర్పించారు.
?ఈ సందర్భంగా కమిటీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ కాసోజు, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ సుధగాని మాట్లాడుతూ, ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో వృద్ధులు, వికలాంగులు, విధవలు, ఒంటరి మహిళలు మరియు ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన అనేకమంది అర్హత కలిగి ఉన్నప్పటికీ, ఇప్పటికీ వారికి ఆసరా పింఛన్లు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమందికి గతంలో అర్హుల జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ పింఛన్లు నిలిపివేశారని, మరికొందరి దరఖాస్తులు గ్రామ స్థాయిలో పెండింగ్‌లోనే ఉండిపోయాయని తెలిపారు.
కమిటీ ప్రధాన డిమాండ్లు:
1)నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించి, అర్హులైన వారి పేర్లతో ప్రత్యేక నివేదికలు తయారు చేయాలి.
2)గతంలో దరఖాస్తు చేసుకుని ఇంకా పింఛన్ రాని వారి అర్జీలను వెంటనే పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలి.
3)?అనర్హులకు ఇస్తున్న పింఛన్లను రద్దు చేసి, నిజమైన పేదలకు, అర్హులకు మాత్రమే మంజూరు చేయాలి.
4)తీసుకున్న చర్యలు, నిర్ణయాలపై జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించి, సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీకి లిఖితపూర్వకంగా తెలియజేయాలి.
సామాజిక న్యాయం దిశగా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్ అందేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కమిటీ సభ్యులు కోరారు.
ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో ఘనంగా 'వికసిత్ భారత్ సంకల్ప సభ'

**మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది**
**సభకు భారీగా తరలివచ్చిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు**






ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో 'వికసిత్ భారత్ సంకల్ప సభ' ఘనంగా నిర్వహించారు. బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు యు. రమేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు శాసన మండలి సభ్యుడు మల్క కుమరయ్య ముఖ్య అతిథిగా, కలబుర్గి మాజీ ఎంపీ ఉమేష్ జాదవ్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మల్క కుమరయ్య, ఉమేష్ జాదవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 ఏళ్లు, ప్రధానమంత్రిగా 12 ఏళ్లుగా మోదీ అందిస్తున్న సేవలు దేశ అభివృద్ధిలో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. రైల్వే వ్యవస్థ ఆధునీకరణ, జాతీయ రహదారుల విస్తరణ, విమానయాన రంగ అభివృద్ధి, వైద్య సదుపాయాల విస్తరణ, ఎయిమ్స్ వంటి సంస్థల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో భారీగా అప్పులు పేరుకుపోయాయని విమర్శించారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు కర్ణం ప్రహ్లాదరావు, మాధవరెడ్డి, సీనియర్ నాయకులు శివరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన్ కుమార్, శంకర్ నాయక్, బోనేటి కిరణ్, శరత్ కుమార్ రెడ్డి, మిట్టా పరమేశ్వర్ రెడ్డి, ఎన్. ఈశ్వరప్ప, వడ్ల నందు, రాజశ్రీనివాస్ రెడ్డి, కేపీ రాజు తదితరులు పాల్గొన్నారు. సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ వివేకానంద రెడ్డి, వికారాబాద్ మున్సిపల్ కౌన్సిలర్, బీజేపీ ఫ్లోర్ లీడర్ అనిల్ కుమార్ యాదవ్, తాండూర్ నాయకులు నాగారం మల్లేశం, బాలేశ్వర్ గుప్త, గిరిమోని శ్రీనివాస్, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సాహో శ్రీలతతో పాటు వివిధ మోర్చాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రోజూ 6 గంటల కన్నా తక్కువగా నిద్రిస్తున్నారా.. అయితే జాగ్రత్త.. నిపుణుల హెచ్చరిక..

రోజూ తగినంత నిద్రపోవడం శరీరానికి విశ్రాంతిని ఇవ్వడమే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే పని, సామాజిక బాధ్యతలు, ఎక్కువ సమయం తెరల ముందు గడపడం వంటి కారణాలతో చాలామంది నిద్రకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ముఖ్యంగా రోజూ ఆరు గంటల కంటే తక్కువ సమయం నిద్రపోవడం అలవాటుగా మారితే, ఉదయం అలసటగా ఉండడమే కాకుండా కాలక్రమేణా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. తగినంత నిద్రలో ఉన్నప్పుడు గుండె వేగం, రక్తపోటు తగ్గుతాయి. దీంతో గుండె, రక్తనాళాలకు విశ్రాంతి లభిస్తుంది. నిద్ర తగ్గినప్పుడు ఈ విశ్రాంతి సమయం తగ్గి రక్తపోటు పెరగడంతో పాటు శరీరాన్ని అప్రమత్తంగా ఉంచే సానుభూతి నాడీ వ్యవస్థ అధికంగా పనిచేస్తుంది.అనేక సమస్యలు..నిద్రలేమి ప్రభావం కేవలం అధిక రక్తపోటుకే పరిమితం కాదు. ఆకలి, రక్తంలో చక్కెర స్థాయిలు, జీవక్రియను నియంత్రించే హార్మోన్ల సమతుల్యతకూ నిద్ర ముఖ్యమే. తగినంత నిద్రపోని వారిలో అధిక కేలరీలు ఉండే ఆహారాలపై కోరిక పెరుగుతుంది. వ్యాయామం చేయాలనే ఉత్సాహం కూడా తగ్గుతుంది. ఈ పరిస్థితులు దీర్ఘకాలంలో శరీర బరువు పెరగడం, ఊబకాయం, రక్తంలో చక్కెర నియంత్రణ సరిగా లేకపోవడం వంటి సమస్యలకు దారితీస్తుంది. ఇవన్నీ గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన ప్రమాద కారకాలుగా మారుతాయి. అయితే ఒక్కరోజు నిద్ర సరిగా లేకపోవడం, ప్రతిరోజూ ఐదు లేదా ఆరు గంటలకే పరిమితమవడం ఒకే రకమైన ప్రభావాన్ని చూపవు. నిద్రలేమి రోజువారీ జీవితంలో అలవాటుగా మారినప్పుడే దీర్ఘకాలిక ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.నిద్ర నాణ్యత ముఖ్యం..నిద్ర ఎంతసేపు పడుతున్నామన్నదే కాకుండా, నిద్ర నాణ్యత కూడా అంతే ముఖ్యం. ఏడు లేదా ఎనిమిది గంటలు నిద్రపోయినా శ్వాస సంబంధిత సమస్యలు, తరచూ నిద్ర మేల్కొనడం, ఒత్తిడి, కొన్ని మందుల దుష్ప్రభావాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా నిద్ర నాణ్యత తగ్గుతుంది. అందువల్ల తగినంత సమయం నిద్రపోయినా విశ్రాంతి లభించకపోతే దాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. నిద్రపోయేందుకు తరచూ ఇబ్బంది పడడం, రాత్రివేళ పదేపదే మేల్కొనడం లేదా పగటిపూట అధిక నిద్రమత్తు ఉండడం వంటి సమస్యలు కొనసాగితే వైద్యులను సంప్రదించడం అవసరం. సమస్యకు కారణమయ్యే ఇతర ఆరోగ్య పరిస్థితులను గుర్తించడం కూడా ముఖ్యమే.
జీవగడియారం సరిగ్గా ఉండాలి..నిద్రను మెరుగుపరచుకోవడానికి ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, ఒకే సమయానికి మేల్కొనడం ద్వారా శరీర జీవ గడియారాన్ని క్రమబద్ధీకరించుకోవచ్చు. సాయంత్రం తర్వాత కెఫీన్‌కు దూరంగా ఉండడం, నిద్రకు ముందు ఎక్కువగా తినకపోవడం, మద్యం వినియోగాన్ని తగ్గించడం, పడకగదిలో అనవసరమైన ఆటంకాలను తొలగించడం ఉపయోగకరంగా ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నాణ్యమైన నిద్రతోపాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం,బరువును నియంత్రించుకోవడం,

## చిట్యాల మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా జయరపు శివ:



**చిట్యాల అక్టోబర్ 7 :** చిట్యాల మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా చిట్యాల పట్టణానికి చెందిన జయారపు శివ ఎన్నికైనట్టు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్ నేత బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా జయరపు శివ మాట్లాడుతూ మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు పున్న కైలేష్ నేత,నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం కు మరియు చిట్యాల మండల అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య పట్టణ అధ్యక్షులు ఎద్దులపురి కృష్ణ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు...

## నిజాయితీని చాటుకున్న సీపీఐ జిల్లా నాయకుడు అశోక్

### దొరికిన ఫోన్ చేర్యాల పోలీసులకు అందజేత

**చేర్యాల అక్టోబర్ 7 :** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు ఓ గుర్తు తెలియని మొబైల్ ఫోన్ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కు బుధవారం దొరికింది. అట్టి మొబైల్ ఫోన్ ను వెంటనే చేర్యాల పోలీసు స్టేషన్ కు తీసుకువచ్చి ఏఎస్ఐ సదాశివ రావు కు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. మానవత్వంతో నిజాయితీ చాటుకున్న అశోక్ ను చేర్యాల పోలీసులు అభినందించారు. ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి వివరాలను ఆరా తీయగా వేచరేణి గ్రామానికి చెందిన చామంతుల సుధాకర్ గా గుర్తించారు. యజమానిని స్టేషన్ కు పిలిపించి ఫోన్ అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## సర్పంచ్ కృషితో ప్రభుత్వ విప్ సహకారంతో సమస్యల పరిష్కారం




**తుర్కపల్లి , అక్టోబర్ 7** తుర్కపల్లి మండలం దత్తాయ పల్లి గ్రామంలో ప్రమాదకరమైన ఇనుప విద్యుత్ స్తంభాల సమస్య గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ కృషితో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో పరిష్కారం అయ్యింది. మంగళవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన సందర్భంగా ట్రాన్స్ఫారం షిప్పింగ్, అవసరమైన కొత్త ట్రాన్స్ఫారం ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభాల సమస్యను గుర్తించారు. ఆయన ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ ఏఈ బిక్షపతి వెంటనే స్పందించారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ ఆధ్వర్యంలో గ్రామంలో ట్రాన్స్ఫారం షిప్పింగ్ పనులు, ప్రమాదకరంగా ఉన్న 11 ఇనుప విద్యుత్తు స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త సిమెంటు స్తంభాలను వేయించడం జరిగింది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు, విద్యుత్ శాఖ ఏఈ బిక్షపతికి సహకరించిన ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు, నాయకులకు, గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ తెలిపారు. గ్రామంలో గత కొన్నాళ్లుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఇనుప విద్యుత్తు స్తంభాల సమస్యను ఎట్టకేలకు పరిష్కారం లభించిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు


## సర్పంచ్ కృషితో ప్రభుత్వ విప్ సహకారంతో సమస్యల పరిష్కారం





**తుర్కపల్లి , అక్టోబర్ 7** తుర్కపల్లి మండలం దత్తాయ పల్లి గ్రామంలో ప్రమాదకరమైన ఇనుప విద్యుత్ స్తంభాల సమస్య గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ కృషితో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో పరిష్కారం అయ్యింది. మంగళవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన సందర్భంగా ట్రాన్స్ఫారం షిప్పింగ్, అవసరమైన కొత్త ట్రాన్స్ఫారం ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభాల సమస్యను గుర్తించారు. ఆయన ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ ఏఈ బిక్షపతి వెంటనే స్పందించారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ ఆధ్వర్యంలో గ్రామంలో ట్రాన్స్ఫారం షిప్పింగ్ పనులు, ప్రమాదకరంగా ఉన్న 11 ఇనుప విద్యుత్తు స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త సిమెంటు స్తంభాలను వేయించడం జరిగింది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు, విద్యుత్ శాఖ ఏఈ బిక్షపతికి సహకరించిన ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు, నాయకులకు, గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ తెలిపారు. గ్రామంలో గత కొన్నాళ్లుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఇనుప విద్యుత్తు స్తంభాల సమస్యను ఎట్టకేలకు పరిష్కారం లభించిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు


# మల్లేశంపల్లి అభివృద్ధికి ఎంపీ రఘునందన్‌రావు ప్రత్యేక చొరవ.

- డ్రైనేజీలు, సీసీ రోడ్లకు రూ.10 లక్షలు.. రీడింగ్ రూమ్, పంచాయతీకి మరో రూ.10 లక్షలు.
- బోరు మంజూరు చేసి తాగునీటి సమస్యకు పరిష్కారం.. మాజీ సర్పంచ్ దార సత్యనారాయణ కృతజ్ఞతలు.



**దౌల్తాబాద్ అక్టోబర్ 7** దౌల్తాబాద్ మండలంలోని మల్లేశంపల్లి గ్రామ అభివృద్ధికి మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ప్రత్యేక చొరవ చూపుతున్నారని గ్రామ మాజీ సర్పంచ్, బీజేపీ సీనియర్ నాయకుడు దార సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపడుతున్నందుకు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. మల్లేశంపల్లి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు, అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు దార సత్యనారాయణ తెలిపారు. దీంతో వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తగ్గడంతో పాటు గ్రామంలోని అంతర్గత రహదారులు మెరుగుపడే అవకాశం ఉందన్నారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా రీడింగ్ రూమ్ ఏర్పాటుకు, గ్రామపంచాయతీకి మరో రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. అలాగే గ్రామంలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని బోరు వేయించడం జరిగిందని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇస్తూ ఎంపీ రఘునందన్‌రావు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి నిధులు మంజూరు చేయడం వల్ల గ్రామంలో అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. మల్లేశంపల్లి గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసి మౌలిక వసతులను మరింతగా అభివృద్ధి చేయాలని ఎంపీని కోరుతున్నట్లు దార సత్యనారాయణ తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లినప్పుడు సానుకూలంగా స్పందించి అభివృద్ధి పనులకు సహకరిస్తు

# పరికి చెరువు అక్రమార్కులపై కేసు నమోదు !

## ఎఫ్టీఎల్, బఫర్జోన్లో పెట్రోల్ బంక్ నిర్మాణానికి యత్నం

- ఎఫ్టీఎల్, బఫర్జోన్లో పెట్రోల్ బంక్ నిర్మాణానికి యత్నం
- హైకోర్టు ఆదేశాలున్నా పనులు కొనసాగించారంటూ
- నార్త్ ట్యాంక్ డివిజన్ ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన జగద్గిరిగుట్ట పోలీసులు
- ఏ1గా బీవీ. ఆంజనేయులు, ఏ2గా బీవీ. వాణి అరుణశ్రీ
- ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.ఉమామహేశ్వరిను ప్రశంసిస్తున్న స్థానికులు
- తప్పుడు సర్వే నివేదికతో పొందిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్



1

GOVERNMENT OF TELANGANA
IRRIGATION & CAD DEPARTMENT

From:
The Deputy Executive Engineer-1,
Sub-Division No.1,
North Tanks Division,
3rd Floor, Budda Bhavan,
Secunderabad.

To:
1. Smt. B. Vani Aruna Sri,
W/o B.V. Anjaneyulu,
R/o Villa No.71, H. No. 6-VC/V-71,
Vasantha City, Serilingampally,
Hafeezpet, PO – Miyapur, RR District-49
2. Sri. B. V. Anjaneyulu,
S/o B. Ramanuja Rao,
R/o Villa No.71, H. No. 6-VC/V-71,
Vasantha City, Serilingampally,
Hafeezpet, PO – Miyapur, RR District-49

Lr. No. DEE-1/NTD/HYD/2026/850 Date: 26.09.2026

Sub: Irrigation & CAD Department – Parki Cheruvu –Proposed Indian Oil Petrol Outlet in Sy. No.302 of Gajularamaram Village, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District – Notice issued on construction of a compound wall for a proposed petrol bunk within the FTL and Buffer zone of Parki Cheruvu - Explanation submitted by Sri B.V. Anjaneyulu in response to the Notice – Consideration of explanation pursuant to the directions of the Hon'ble High Court in W.P. No.18581 of 2026 – Reply furnished – Reg.

Ref: 1. This office Notice No.DEE-1/NTD/HYD/2026/602, dated 18.04.2026.
2. Explanation submitted by the petitioner, dated 11.05.2026.
3. Orders of the Hon'ble High Court in W.P. No.18581 of 2026, dated 17.06.2026 & 15.07.2026
4. Preliminary Notification of Parki Cheruvu (Lake ID No.4801) dated 07.06.2014
5. G.O.Ms.No.168, MA & UD Department, dated 07.04.2012.
6. Telangana Irrigation Act, 1357 Fasli and other applicable statutory provisions.

******

In compliance with the directions of the Hon'ble Court dated 17.06.2026, the explanation submitted by the petitioner, Sri B.V. Anjaneyulu, vide his explanation dated 11.05.2026, has been duly examined and considered by this office with reference to the relevant departmental records, the notified Full Tank Level (FTL) records of Parki Cheruvu, field inspection reports, GPS survey data, and the applicable statutory provisions governing the protection, preservation and regulation of lakes and other water bodies.

The contentions raised by the petitioners have been duly considered and are replied to as follows:

1 Regarding the Tahsildar's Letter dated 06.11.2024: The petitioners have placed reliance on Letter No. B/1381/2024 dated 06.11.2024 issued by the Tahsildar. A careful examination of

**ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్:** గాజులరామారం పరికి చెరువు ఎఫ్టీఎల్, బఫర్జోన్ పరిధిలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రయత్నించిన వ్యవహారంలో జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. చెరువు పరిరక్షణ నిబంధనలను ఉల్లంఘించడంతో పాటు, తెలంగాణ హైకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగించారనే ఆరోపణలపై బీవీ. ఆంజనేయులు, బీవీ. వాణి అరుణశ్రీపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. నార్త్ ట్యాంక్ డివిజన్ ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. ఉమామహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లో అక్టోబర్ 6న కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్లోని 329(3), 324(4) సెక్షన్లతో పాటు పీడీపీపీ చట్టంలోని సెక్షన్ 3 కింద కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఐఆర్లో పేర్కొన్నారు.

అంతేకాకుండా ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశం వేరుగా ఉందని, ఆ స్థలాన్ని ఇరిగేషన్ లేదా రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు తనిఖీ చేయలేదని ఫిర్యాదులో వెల్లడించారు. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదా ఎన్ఓసీ జారీ కాలేదని అధికారులు స్పష్టం చేశారు.



FIRST INFORMATION REPORT
(Under section 173 and 176 BNSS)
T.S.P.M. Orders 470,500

1. District Cyberabad P.S. Jagadgirigutta Year 2026 FIR No. 1351/2026 Date 06-10-2026
2. Acts & Section(s): 329(3),324(4) BNS,3 PDPPA
3. a) Occurrence of Offence: Day Tuesday Date & Time From
Date & Time To Prior To 06-10-2026 13:10:00 Time Period
b) Information Received at P.S.: Date & Time 06-10-2026 13:10:00
General Diary Reference: Entry No 13 Date & Time 06-10-2026 13:10:00
4. Type of Information: Written
5. Place of Occurrence:
a) Distance and Direction From P.S.: 4 KM , North Beat No. 4
b) Address Place Sy No: 302, Gajularamaram, Jagadgirigutta Area/Mandal Jagadgirigutta Street/Village Gajularamaram
City/District MEDCHAL MALKAJGIRI State Telangana PIN
c) In case, outside the limit of this Police Station, then
Name of P.S. District
6. Complainant / Informant:
a) Name Sri. M Uma Maheshwari
b) Father's /Husband's Name
c) Date/Year of Birth Age Years
d) Nationality India e) Caste
f) Passport No Date of Issue Place of Issue
g) Occupation Mobile No. 9247910635
h) Address House No Area/Mandal Hyderabad Street/Village
City/District HYDERABAD State TELANGANA PIN
7. Details of known/suspected/unknown accused with full particulars:
Serial No : 1
a) Name B.V.Anjaneyulu
b) Father's /Husband's Name
c) Occupation Male



7

RRN,J
W.P.No.18581 of 2026

are at liberty to take appropriate action strictly in accordance with law.

13. With the above observations, the Writ Petition is disposed of. There shall be no order as to costs.

Pending miscellaneous applications, if any, shall stand closed.

NAMAVARAPU RAJESHWAR RAO, J

Date: 15.07.2026.
KRI

**ఆదాబ్ సైబరాబాద్ ఎఫెక్ట్**

### హైకోర్టు ఆదేశాలున్నా నిర్మాణం

గాజులరామారం సర్వే నంబర్ 302లో పరికి చెరువు ఎఫ్టీఎల్, బఫర్జోన్ పరిధిలో పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో డబ్ల్యూపీ నంబర్ 18581/2026కు సంబంధించి జూన్ 17, జూలై 15 తేదీల్లో ఆదేశాలు వెలువడినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగించినట్లు అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సెప్టెంబర్ 29న నిర్వహించిన తనిఖీల్లో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు.

### బఫర్జోన్లో 14 చదరపు మీటర్లు

పెట్రోల్ బంక్ కోసం 420 చదరపు మీటర్ల స్థలానికి ఎన్ఓసీ తీసుకున్నట్లు ఇరిగేషన్ శాఖ పేర్కొంది. అయితే అందులో 14 చదరపు మీటర్ల విస్తీర్ణం పరికి చెరువు బఫర్జోన్ పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

### చెరువు పరిరక్షణ నిబంధనల ఉల్లంఘన

తెలంగాణ ఇరిగేషన్ యాక్ట్ ఫసలీ 1357లోని క్లాజ్ 49 ప్రకారం చెరువు ఎఫ్టీఎల్, బఫర్జోన్ పరిధిలో అనధికారిక నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. నీటి వనరును ప్రభావితం చేసే విధంగా నిర్మాణాలు చేపట్టడం, చెరువు స్వరూపాన్ని దెబ్బతీయడం వంటి చర్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

### తప్పుడు సర్వే నివేదికతో అనుమతులా?

పెట్రోల్ బంక్కు అనుమతులు పొందేందుకు సమర్పించిన సర్వే నివేదికలో వాస్తవాలను తప్పుగా చూపించారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తప్పుడు సర్వే నివేదిక ఆధారంగా అనుమతులు పొందినట్లు తేలితే



సంబంధిత అనుమతులను రద్దు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చెరువు ఎఫ్టీఎల్, బఫర్జోన్ పరిధిని అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేసి, వాస్తవాలను బహిర్గతం చేయాలని కోరుతున్నారు.

### ఇరిగేషన్ అధికారిణికి స్థానికుల ప్రశంసలు

పరికి చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. ఉమామహేశ్వరిని స్థానికులు అభినందిస్తున్నారు. చెరువు భూములను పరిరక్షించేందుకు అధికారులు ఇదే తరహాలో కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు. హైకోర్టు ఆదేశాలు, సెప్టెంబర్ 26న జారీ చేసిన నోటీసుతో పాటు సంబంధిత పత్రాలను ఇరిగేషన్ శాఖ పోలీసులకు సమర్పించింది. ఈ వ్యవహారంపై జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, సర్వే నివేదికలు, ఎన్ఓసీలపై కూడా దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులుడిమాండ్ చేస్తున్నారు.


EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

# ఇంటి నెంబర్ 4-15 వ్యవహారంపై సీ.ఎస్ కు ఆర్టీఐ

**నాలుగు శాఖల పరిధిలోని రికార్డులపై సమగ్ర సమాచారం కోరిన సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ.**







**ఆదాబ్ సైబరాబాద్,ఖమ్మం/స్టేషన్ ఘనపూర్ :**ఇప్పుగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఇంటి నెంబర్ 4-15 ఇంటి నంబర్‌కు సంబంధించిన వ్యవహారంపై సమగ్ర వివరాలు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచార హక్కు చట్టం--2005 కింద ఆర్టీఐ దరఖాస్తు సమర్పించినట్లు సమాచార హక్కు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇంటి నంబర్‌లో జరిగిన మార్పులు,పంచాయతీ రికార్డుల్లో నమోదైన వివరాలు,సంబంధిత ఫిర్యాదులు, గ్రీవెన్స్‌లు, పంచాయతీ కార్యదర్శి బదిలీ,పోలీస్‌స్టేషన్‌కు అందిన ఫిర్యాదులు,ఫోర్జరీ సంతకాలుగా పేర్కొన్న ఆరోపణలు,ఎంపీడీవో కార్యాలయం తీసుకున్న చర్యలు తదితర అంశాలపై అధికారిక రికార్డుల ద్వారా వాస్తవాలను తెలుసుకునేందుకే ఈ సమాచారాన్ని కోరినట్లు పేర్కొన్నారు.ఈ వ్యవహారానికి సంబంధించిన సమాచారం ఒక్క ప్రభుత్వ కార్యాలయానికి మాత్రమే పరిమితం కాకుండా పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ,జిల్లా కలెక్టర్ కార్యాలయం,పోలీస్ కమిషనర్ కార్యాలయం,ఎంపీడీవో కార్యాలయాల పరిధిలో ఉండే అవకాశం ఉన్నందున అన్ని శాఖల నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కోరినట్లు తెలిపారు.

### ఇంటి నంబర్ మార్పులపై పూర్తి వివరాలులి

ఇంటి నెంబర్ 4-15కు సంబంధించి తొలుత ఇంటి నంబర్ ఎలా కేటాయించారు?,అనంతరం ఏమైనా మార్పులు జరిగితే వాటికి కారణాలేమిటి?,మార్పు కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకున్నారా?,దానికి సంబంధించి పంచాయతీ అధికారులు ఎలాంటి విచారణ చేపట్టారు?,ఎవరి అనుమతితో ఇంటి నంబర్‌లో మార్పులు చేశారు?,వంటి వివరాలను అధికారిక రికార్డుల ద్వారా వెల్లడించాలని కోరినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.అదేవిధంగా హౌస్ రిజిస్టర్,అసెస్మెంట్ రిజిస్టర్,ఇంటి పన్ను రికార్డులు,పన్ను చెల్లింపులకు సంబంధించిన వివరాలు, ఇంటి నంబర్ కేటాయింపు లేదా మార్పులకు సంబంధించిన దరఖాస్తులు,అనుమతులు,ఫైల్ నోట్లు,సంబంధిత ఉత్తర్వులు తదితర రికార్డుల ప్రతులను అందించాలని కోరినట్లు తెలిపారు.

లిపంచాయతీరాజ్ శాఖ నుంచి సమాచారంలి

ఇంటి నంబర్ వ్యవహారానికి సంబంధించిన పంచాయతీ రికార్డులన్నింటినీ పరిశీలించేందుకు అవకాశం కల్పించాలని,సంబంధిత ఫైల్ ఏ అధికారి వద్ద నుంచి ఏ అధికారి వద్దకు వెళ్లిందో తెలిపే ఫైల్ మూవ్‌మెంట్ వివరాలు కూడా అందించాలని కోరినట్లు పేర్కొన్నారు.ఇంటి నంబర్ మార్పు విషయంలో పంచాయతీ కార్యదర్శి,ఇతర సిబ్బంది లేదా అధికారులు ఏదైనా నివేదిక రూపొందించి ఉంటే దాని ప్రతులను,దానిపై ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలను కూడా వెల్లడించాలని కోరినట్లు తెలిపారు.

### కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులపై ఆరాలి

ఇంటి నెంబర్ 4-15 వ్యవహారానికి సంబంధించి గతంలో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఎవరైనా ఫిర్యాదులు,వినతులు లేదా గ్రీవెన్స్‌లు సమర్పించి ఉంటే వాటి వివరాలను అందించాలని కోరినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.ఆయా ఫిర్యాదులను ఏ అధికారికి పంపారు?,ఎప్పుడు పంపారు?,సంబంధిత అధికారుల నుంచి నివేదిక కోరారా?,తనిఖీలు నిర్వహించారా?,యాక్షన్ టేకెన్ రిపోర్టులు సమర్పించారా? వంటి వివరాలను అధికారిక రికార్డుల ఆధారంగా వెల్లడించాలని కోరినట్లు చెప్పారు.అలాగే ఈ అంశంపై ఇప్పటివరకు జిల్లా స్థాయిలో ఏమైనా నిర్ణయం తీసుకున్నట్లయితే ఆ ఉత్తర్వులు,నివేదికలు,నోట్‌ఫైళ్ల ప్రతులను అందించాలని కోరినట్లు పేర్కొన్నారు.

### పోలీస్‌స్టేషన్‌కు అందిన ఫిర్యాదులపై వివరాలు

ఇంటి నెంబర్ 4-15 వ్యవహారంలో ఫోర్జరీ సంతకాలుగా పేర్కొన్న ఆరోపణలకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌కు ఎవరైనా ఫిర్యాదు చేశారా?,ఫిర్యాదు అందితే దానిపై పోలీస్ అధికారులు ఏం చేశారు?,ప్రాథమిక విచారణ జరిగిందా?,కేసు నమోదు చేశారా?,దర్యాప్తు ఏ స్థాయిలో ఉంది? అనే అంశాలకు సంబంధించి చట్టబద్ధంగా వెల్లడించగల సమాచారాన్ని అందిం చాలని వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని కోరినట్లు తెలిపారు.ఫిర్యాదు,విచారణ,కేసు లేదా దర్యాప్తుకు సంబంధించిన రికార్డుల్లో చట్టప్రకారం వెల్లడించగల భాగాల ప్రతులను అందించాలని ఆర్టీఐలో కోరినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

### ఎంపీడీవో కార్యాలయంపై ప్రత్యేకంగా ప్రశ్నలు

ఈ వ్యవహారంలో ఎంపీడీవో కార్యాలయానికి ప్రజల నుంచి ఫిర్యాదులు, గ్రీవెన్స్‌లు అందినట్లయితే వాటిపై ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకున్నారనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని కోరినట్లు తెలిపారు.

ఫిర్యాదు అందిన తేదీ,దానిపై అధికారులు తీసుకున్న చర్య, ఎవరికి విచారణ బాధ్యత అప్పగించారు?,ఏ తేదీన తనిఖీ నిర్వహించారు?,సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి నుంచి నివేదిక కోరారా?,కోరితే నివేదిక ఎప్పుడు అందింది?,నివేదికలో ఏమి పేర్కొన్నారు?,దానిపై ఉన్నతాధికారులు ఏ నిర్ణయం తీసుకున్నారు? వంటి అంశాలకు సంబంధించిన అధికారిక రికార్డులను అందించాలని కోరినట్లు చెప్పారు.అదేవిధంగా ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలో ఇంటి నెంబర్ 4-15 వ్యవహారానికి సంబంధించిన వార్తలు వచ్చిన తర్వాత అధికారుల దృష్టికి విషయం వెళ్లిందా?, వెళ్లినట్లయితే దానిపై ఏమైనా చర్య లు తీసుకున్నారా? అనే వివరాలను కూడా కోరినట్లు తెలిపారు.

### చర్యలు తీసుకోకపోతే కారణాలేమిటి?

ఫిర్యాదులు, గ్రీవెన్స్‌లు లేదా మీడియా ద్వారా విషయం అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోతే అందుకు కారణాలు ఏమిటి?,ఆ విషయాన్ని ఫైల్‌లో నమోదు చేశారా?,సంబంధిత అధికారి ఏదైనా నోట్ నమోదు చేశారా?,ఉన్నతాధికారులు ఏదైనా ఆదేశాలు జారీ చేశారా?,అనే అంశాలపై కూడా సమాచారం ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.చర్యలు తీసుకున్నట్లయితే ఆ చర్యలకు సంబంధించిన నోట్‌ఫైల్,ఉత్తర్వులు,తనిఖీ నివేదికలు,సంబంధిత అధికారుల నివేదికలు,యాక్షన్ టేకెన్ రిపోర్టుల ప్రతులను ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

### పంచాయతీ కార్యదర్శి బదిలీపై స్పష్టత కోరుతూ..

ఇంటి నంబర్ వ్యవహారానికి సంబంధించిన ఫిర్యాదులు, వివాదాలు కొనసాగుతున్న సమయంలో సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి బదిలీ కావడానికి దారితీసిన పరిపాలనా కారణాలపై కూడా వివరాలు కోరినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కార్యదర్శి బదిలీకి ముందు ఏదైనా ఫిర్యాదు అందిందా?,ఏదైనా విచారణ జరిగిందా?,విచారణ నివేదిక సమర్పించారా?, కార్యదర్శిపై పరిపాలనా చర్యలకు సంబంధించిన ప్రతిపాదన ఏమైనా ఉందా?,బదిలీ ఉత్తర్వులు ఏ అధికారి జారీ చేశారు?,బదిలీకి అధికారికంగా నమోదు చేసిన కారణం ఏమిటి?,వంటి వివరాలను సంబంధిత రికార్డుల ద్వారా వెల్లడించాలని కోరినట్లు తెలిపారు.బదిలీకి సంబంధించిన ఉత్తర్వులు,ప్రతిపాదనలు,నోట్‌ఫైళ్లు,వర్తించే నిబంధనలు తదితర సమాచారాన్ని అందించాలని ఆర్టీఐ దరఖాస్తులో కోరినట్లు పేర్కొన్నారు.

నాలుగు శాఖల నుంచి సమాచారం సేకరించాలని విజ్ఞప్తి

ఈ వ్యవహారంలో సమాచారం వేర్వేరు శాఖలు,కార్యాలయాల పరిధిలో ఉన్నందున ఒకే కార్యాలయంలో సమాచారం అందుబాటులో లేకపోతే సంబంధిత ప్రజా ప్రాధికార సంస్థకు దరఖాస్తును బదిలీ చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

లిసెక్షన్ 6(3) ప్రకారం బదిలీ చేయాలని విజ్ఞప్తిలి

ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 6(3) ప్రకారం సంబంధిత ప్రజా సమాచార అధికారికి దరఖాస్తును బదిలీ చేసి,చట్టంలో నిర్దేశించిన గడువులో సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరినట్లు తెలిపారు.

### 'రికార్డులే వాస్తవాలను వెల్లడించాలి'

ఈ సందర్భంగా సమాచార హక్కు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. "ఇంటి నెంబర్ .4-15 ఇంటి నంబర్ ఎలా మారింది? ఎవరెవరు దానికి అనుమతులు ఇచ్చారు?, పంచాయతీ రికార్డుల్లో ఏ విధంగా నమోదైంది?,కార్యదర్శి బదిలీకి కారణం ఏమిటి?,ఫోర్జరీ సంతకాలుగా పేర్కొన్న ఆరోపణలపై పోలీస్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంది? ,కలెక్టర్,ఎంపీడీవో కార్యాలయాలకు వచ్చిన ఫిర్యాదులపై ఏం చేశారు?,మీడియా ద్వారా విషయం అధికారుల దృష్టికి వచ్చిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్నారు?,అనే అంశాలపై అధికారిక రికార్డులే సమాధానం చెప్పాలి" అని అన్నారు.ఎవరినీ ముందుగానే దోషిగా నిర్ధారించడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రికార్డులు, ఫైళ్లు, ఉత్తర్వులు, నివేదికల ఆధారంగా వాస్తవాలను తెలుసుకుని ప్రజల ముందుంచడమే తమ ఉద్దేశమని తెలిపారు.ఏదైనా తప్పిదం జరిగినట్లు అధికారిక రికార్డుల ద్వారా తేలితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎలాంటి తప్పిదం జరగకపోతే అదే విషయాన్ని అధికారిక రికార్డుల ద్వారా ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కుచట్టం పరిరక్షణ కమిటీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కాశోజు శ్రీధర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి, జనగామ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ జావిద్ మరియు సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఆయా జిల్లాల ప్రధాన కార్యదర్శులు పాల్గొని సంబంధిత ఆర్టీఐ దరఖాస్తులను సమర్పించినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

# హైదరాబాద్ లో 30 మంది ముస్లిం ఓటర్ల తొలగింపు యత్నం.. బీజేపీ ఏజెంట్‌పై కేసు

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఓటర్ల జాబితా నుంచి 30 మంది ముస్లింల పేర్లను అక్రమంగా తొలగించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై బీజేపీ బూత్ లెవల్ ఏజెంట్‌పై కేసు నమోదైంది. ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఈ ఘటన రాజకీయంగా కలకలం రేపుతోంది.వివరాల్లోకి వెళితే, ముషీరాబాద్ నియోజకవర్గంలోని సూర్య నగర్ పోలింగ్ స్టేషన్ నెం. 210 పరిధిలో ఎస్. బాలచందర్ అనే బీజేపీ బూత్ ఏజెంట్, 30 మంది ఓటర్ల పేర్లను తొలగించాలని కోరుతూ సెప్టెంబర్ 28న ఫారం-7 దరఖాస్తులను సమర్పించారు. బాధితులంతా ముస్లిం వర్గానికి చెందినవారే. అధికారులు వాటిని మూకుమ్మడిగా స్వీకరించేందుకు నిరాకరించడంతో, అతను ఆ పత్రాలను అక్కడే వదిలివెళ్లినట్లు తెలుస్తోంది.ఈ ఘటనపై ముషీరాబాద్



నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) టి. ప్రవీణ్ కుమార్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులు జరిపిన విచారణలో ఆ 30 మంది ఓటర్లు వారి చిరునామాల్లోనే నివసిస్తున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో, దురుద్దేశంతోనే బాలచందర్ ఈ చర్యకు పాల్పడ్డారని ఈఆర్ఓ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు బాలచందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ఘటనపై కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు తీవ్రంగా స్పందించాయి. దీని వెనుక పెద్ద కుట్ర ఉందని, దీనిపై సిట్ విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మరోవైపు, ఈ ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఖండించారు. తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఫారం-7 దుర్వినియోగంపై నమోదైన తొలి ఎఫ్ఐఆర్ ఇదే కావడం గమనార్హం.

# అక్రమమని తేలితే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెబుతా

**మహబూబ్ నగర్ :** అక్రమంగా ఆస్తులు సంపాదించినట్లు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ) తిప్పికొట్టారు. తాను అరగుంట భూమిని అక్రమంగా సంపాదించినట్లు రుజువు చేస్తే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెబుతానని మంత్రులకు సవాలు విసిరారు.పాలమూరు జిల్లాలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వందలాది ఎకరాల భూమిని సంపాదించారని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మూడు సంవత్సరాలైన కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలు నేటికి రుజువు చేయలేక పోయారని విమర్శించారు. వ్యతిరేక ప్రచారాలు చేస్తే చట్టబద్ధంగా ఎదుర్కుంటా మని హెచ్చరించారు.పానగల్ వ్యవసాయ క్షేత్రం తన కష్టార్జితమని వెల్లడించారు.663 సర్వే నంబర్ ఉబేద్దుల కొత్వాల్ చెందినదని, ఇందులో అధికారులపై ఒత్తిడి చేసి మా అమ్మాయికి చెందిన అరగంట అక్రమమని తేల్చారని ఆరోపించారు. ప్రభుతంపై నిత్యం పోరాడుతున్న తనపై వ్యక్తిగత కక్షకు పాల్పడుతున్నారు. అన్ని ఆస్తులు బహిరంగ పరుస్తా. మీకు చేతనైతే మీడియా సాక్షిగా తనపై చేసిన భూ ఆక్రమణలు రుజువు చేయాలని డిమాండ్ చేశారు. అసూయా, కుయుక్తులతో రాజకీయ మనుగడకు తావు లేదని, దమ్ముంటే ఛాలెంజ్ స్వీకరించి బహిరంగ చర్చకు సిద్ధం కావాలని మంత్రులకు సూచించారు.




# విద్యుత్ కోతలపై రాయపోల్ మండలంలో రైతుల ధర్నా



**రాయపోల్ అక్టోబర్ అక్టోబర్ 7:** వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నా యని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం చేగుంట--గజ్వేల్ ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. గుర్రాల సోఫా, వీరనగర్ చౌరస్తాల వద్ద రైతులు పెద్ద సంఖ్యలో చేరుకునిప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ నినాదాలు చేశారు. అలాగేవిద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు నీరు అందించేందుకు విద్యుత్ కోసం ఎదురు చూడాల్సి వస్తోందని, గంటల తరబడి కోతలు విధిస్తుండటంతో సాగు తీవ్రంగా దెబ్బతింటోందని పేర్కొన్నారు. చేతికొచ్చిన పంటలు విద్యుత్ సరఫరా లేక నష్టపోయే పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించే వరకు కదిలేది లేదని స్పష్టం వ్యవసాయానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు.విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని స్పష్టమైన గజ్వేల్ ప్రధాన రహదారిపై ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. స్థానిక ఎసమస్య పరిష్కారంపై స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు.

# తెలంగాణలో నీరో రాజ్యం కంటే దారుణ పరిస్థితులున్నాయి

**హైదరాబాద్:**కరెంట్ కోసం పవర్ స్టేషన్ల దగ్గర ధర్నాలు చేస్తున్నారు. జాతీయ రహదారులను దిగ్భంధిస్తున్నారు. పొట్టకొచ్చిన చేను ఎండిపోతున్నదని రైతులు పొగిలి పొగిలి ఏడుస్తున్నరని.. ముఖ్యమంత్రికి ఇవేవీ పట్టవు.. ఇవేవి వినబడవని శాసన మండలి బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల బ్రతుకులు ప్యారడైజ్ సినిమాలో మాలిక్ చేతిలో సవారీల బ్రతుకుల్లా మారాయని తెలంగాణలో నీరో రాజ్యం కంటే దారుణ పరిస్థితులు ఉన్నాయి. కేసీఆర్‌పైన నిరంతరం విషం చిమ్ముతున్నారని అన్నారు. ఢిల్లీకి సూట్ కేసులు ప్రతిపక్షంపై కేసులు.. రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా ఉన్నాయని.. పోలీసులు ప్రతిపక్ష నేతల ఇళ్ల వద్ద బందీలుగా మారారు. కాంగ్రెస్ నేతల బౌన్సర్లలాగా పోలీసులు వ్యవహరిస్తున్నారని అన్నారు.బీఆర్ఎస్ నేతల రిమాండ్ ను కోర్టులు రిజెక్ట్ చేస్తున్నాయి. రాష్ట్రంలో బరితెగింపు పాలన నడుస్తోందని దేశపతి




శ్రీనివాస్ ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో బారికేడ్లు ఎక్కి నిరసన చేస్తున్నారు. ఢిల్లీలో బడే భాయ్ మోదీ కేసులు పెట్టలేదు. ఇక్కడ చోటే భాయ్ కేడీ అరెస్టులు చేస్తున్నారు.. మెడికవర్ హాస్పిటల్ ముందు ఫ్లెక్సీలు పెడితే అరెస్ట్ చేస్తారా..? కేసీఆర్ ఫామ్ హౌస్‌పై ఫ్లెక్సీలు పెట్టిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోరని ప్రశ్నించారు. బ్యూరో క్రాట్ ఫిర్యాదు చేస్తే అరెస్టు చేస్తారా..? అని దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు.మూడేళ్లలో కాంగ్రెస్ చేసిన ఘనత శూన్యం..లిక్కర్ తయారీకి నీళ్ల కరువు లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటున్నారు. తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌పై వ్యక్తిత్వ హననానికి పాల్పడలేదా...? లేని రంకులు అంటగట్టి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టలేదా..? మూడేళ్లలో కాంగ్రెస్ చేసిన ఘనత శూన్యమని.. ప్రజాస్వామ్యం 7వ గ్యారెంటీ అని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు నిర్బంధాలు కొనసాగిస్తోంది. కేసీఆర్ నిరంకుశ పాలన నడుస్తోందని కొంతమంది మేధావులు అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏమైనా పాలంకుశ పాలన నడుస్తోందా...? రేవంత్ రెడ్డికి సమయం దగ్గర పడిందన్నారు.రేవంత్ రెడ్డి సీఎంగా, హోంమంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా నీ పరిస్థితి ఏంటి..? అని దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు.